# ఊరంచుతండాలో ఊహించని అభివృద్ధి

- ప్రత్యేక జీపీతో మారిన తండా రూపురేఖలు
- రూ.26 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- శ్మశానవాటిక, డంపింగ్ యార్డు
- చురుగ్గా కొనసాగుతున్న జీపీ భవన నిర్మాణం


ఊరంచుతండాలో నిర్మించిన శ్మశానవాటిక


నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం

నవాబ్‌పేట, అక్టోబర్ 13 : మండలంలోని ఊరంచుతండాలో గడిచిన నాలుగున్నరేండ్లలో ఊహించని అభివృద్ధి జరిగింది. ఎక్కడో మారుమూలన విసిరేసినట్లు ఉండే గిరిజన తండాను తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడంతో తండాలో అభివృద్ధి పనులు చకచకా చేపట్టారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో రేకుల చౌడాపూర్‌లో తండా ఉండేది. సీఎం కేసీఆర్ గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించిన నేపథ్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో.. ఊరంచుతండాను సైతం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఊరంచుతండాలో 850 మంది జనాభా ఉండగా, 476 మంది ఓటర్లు ఉన్నారు. తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసిన తర్వాత తండాకు మొదటి సర్పంచ్‌గా అదే తండాకు చెందిన గిరిజన మహిళ కేతావత్ సోనీబాయి ఎన్నికయ్యారు. తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయడంతో గతంలో చేయని అభివృద్ధిని తండావాసులు కండ్లారా చూశారు. అస్తవ్యస్తంగా ఉన్న తండా రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. రూ.20లక్షలతో తండాలో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. రూ. 6లక్షలతో మురుగు కాల్వల నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే రూ.12లక్షలతో శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టారు. రూ.3లక్షలతో పల్లెప్రకృతి వనం, రూ.2లక్షలతో డంపింగ్ యార్డు నిర్మాణం పనులను చేపట్టారు. అలాగే రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్లు తండాలో ప్రతి నెలా 99మందికి అందుతున్నాయి. రైతుబంధుతోపాటు మిషన్ భగీరథ నీటితో తండా ప్రజలకు నీటి కష్టాలు లేకుండా పోయాయి.

**గతంలో దుర్గంధం..**

గతంలో ఉమ్మడి గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడు తండాకు నిధులివ్వకపోవడమే కాకుండా..తాగునీటికి సైతం కష్టాలు పడ్డామని తండా మహిళలు, రైతులు చెబుతున్నారు. సీసీ రోడ్లు, మురుగుకాల్వలు లేక గతంలో రోడ్లపై దుర్గంధం వెదజల్లేదని వివరించారు. ప్రత్యేక రాష్ట్రంలో మా తండా ప్రత్యేక పంచాయతీ చేసినందుకే ఇంత అభివృద్ధి జరిగిందని తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తండాను గ్రామ పంచాయతీ చేసి అభివృద్ధి పనులు చేపట్టిన సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని తండా ప్రజలు పేర్కొంటున్నారు.

## గతంలో కంపు వాసన వచ్చేది..



మా ఊరంచుతండా గ్రామ పంచాయతీగా ఏర్పడక ముందు ఒక్క మురుగు కాల్వ గానీ, సీసీ రోడ్డు ఉండేది కాదు. మురుగంతా రోడ్డు మీదనే పోయేది. తండా బాగోగులు గురించి గతంలో పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పడిన తర్వాతనే నాలాంటి ఒక గిరిజన మహిళను తండాకు మొట్టమొదటి సర్పంచ్ కాగలిగింది. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేసుకున్న తర్వాత అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. తమకు వెన్నంటి ఉండే ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

**- కేతావాత్ సోనీబాయి, సర్పంచ్, ఊరంచుతండా**

## నీటి కష్టాలు తొలిగాయి..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు మా తండాలో తాగునీటి కోసం తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తండాలో వేసిన బోర్లు వట్టిపోయేవి. నీటి కోసం మహిళలు బిందెలు పట్టుకొని కిలోమీటర్ల దూరం వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లేవారు. ఇప్పుడు అలాంటి తిప్పలు తప్పింది. తండాకు ప్రతి రోజూ మిషన్ భగీరథ నీరు వస్తోంది. అలాగే మా తండా ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైన తర్వాత అనేక అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగింది.

**- కేతావత్ శంకర్‌నాయక్, తండా వాసి, ఊరంచుతండా**

## పోలింగ్ స్టేషన్ పరిశీలన

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 13 : జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట హైస్కూల్ 213 పోలింగ్ స్టేషన్‌ను శుక్రవారం అదనపు కలెక్టర్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అంగన్‌వాడీ టీచర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## 'భారత్‌వందే జగద్గురం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు, అక్టోబర్ 13 : స్థానిక ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ రంగ సూర్యనారాయణ రచించిన 'భారత్ వందే జగద్గురం' అనే పద్య భాగ రచనను పాలమూరు విశ్వవిద్యాలయంలో శుక్రవారం రోజున ఉపకులపతి ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, అధ్యాపకుడు డాక్టర్ సత్యాభాస్కర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణగౌడ్, ఈశ్వరయ్య, డాక్టర్ తిరుపతయ్య, సతీశ్‌రెడ్డి, డాక్టర్ రాములు, డాక్టర్ రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

## వలకు చిక్కిన మొసలి


చేపల వలకు చిక్కిన మొసలి

ఆత్మకూరు, అక్టోబర్ 13 : పట్టణంలోని పరమేశ్వరస్వామి చెరువులో మొసలి చేపల వలకు చిక్కింది. పట్టణంలోని మొదటి వార్డు ఖానాపూర్‌కు చెందిన మత్స్యకారులు చెరువులో చేపల కోసం వల వేయగా, మొసలి చిక్కింది. బయటకు తీసిన మొసలిని కాసేపయ్యాక తిరిగి చెరువులోనే వదిలేశారు. చెరువులో మొసలి సంచరిస్తున్న నేపథ్యంలో మత్స్యకారులు, ఇతరులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ అధికారులు సూచించారు. రేపటి నుంచి బతుకమ్మ సంబురాలు ఆరంభమవుతున్న నేపథ్యంలో పుష్కరఘాట్ వద్ద తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అడ్డాకులలో ఫాగింగ్

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 13 : గ్రామాల్లో పెరుగుతున్న దోమల నివారణ కోసం శుక్రవారం ఫాగింగ్ చేయించారు. సర్పంచ్ మంజుల ఆదేశానుసారం గ్రామ పంచాయతీ సిబ్బంది రాత్రి అడ్డాకుల గ్రామంలోని పుర వీధుల్లో ఆటో ద్వారా తిరుగుతూ ఫాగింగ్ చేశారు. గ్రామంలో దోమల పెరగడంతోనే విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని, దోమల నివారణ కోసం పాగింగ్ చేయిస్తున్నట్లు సర్పంచ్ మంజుల తెలిపారు.

## ఆవులను అమ్ముతానని రైతుకు టోకరా

- ఫోన్ పే ద్వారా రూ.62వేలు నొక్కేసిన ఘనుడు

నవాబ్‌పేట, అక్టోబర్ 13 : మండలంలోని దర్పల్లికి చెందిన ఆరె రమేశ్ అనే రైతును ఓ సైబర్ నేరగాడు నిలువునా ముంచి మోసం చేశాడు. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దర్పల్లికి చెందిన ఆరె రమేశ్‌కు గత ఆగస్టు నెల 13వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి 8486164290 నంబర్ నుంచి ఫోన్ చేసి తన వద్ద చాలా పాడి ఆవులు ఉన్నాయని, అమ్ముతానని తెలిపినట్లు ఎస్సై వివరించారు. గుర్తు తెలియని వ్యక్తి హిందీలో మాట్లాడి ఆవుల ఫొటోలు వాట్సాప్‌లో పెట్టడంతో రెండు ఆవులు కావాలని, మాట్లాడి పూర్తిగా నమ్మిన రమేశ్ అతడి ఫోన్‌పేకు మొదటి రోజు రూ.5,100 ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు తెలిపారు. ఆ తర్వాత మిగతా డబ్బులు 16వ తేదీన పంపినట్లు తెలిపారు. మొత్తం రూ.62వేలు గుర్తు తెలియని వ్యక్తికి పంపారు. డబ్బులు పంపించిన తర్వాత అతడి ఫోన్ స్విచాఫ్ వస్తుందన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు

జడ్చర్ల, అక్టోబర్ 13 : ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమిస్తే చర్యలు తప్పవని జడ్చర్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందునా ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. శుక్రవారం జడ్చర్లలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఫ్లైయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్ టీంలు, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫ్లయింగ్ స్క్వాడ్-3, స్టాటిక్ సర్వేలైన్స్ టీంలు-3, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం-6 నియమించినట్లు చెప్పారు. ఎన్నికల నియమావళి ప్రకారం అందరూ నడచుకునేలా చూడాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రతి అంశాన్ని పరిశీలించాలన్నారు. సభలు, సమావేశాలకు సంబంధించి వీడియోలు తీయాలని సూచించారు. తీసిన వీడియోలను ఇతరకు పంపితే కఠినచర్యలు ఉంటాయన్నారు. వాహనాలను తనిఖీ చేసే సమయంలో కూడా వీడియోలు తీయాలన్నారు. సీ-విజిల్ యాప్‌కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. ఆరగంటలో ఫిర్యాదుకు సంబంధించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఇదివరకే పనులు ప్రారంభమై ఉంటే వాటిని కొనసాగించవచ్చని, కొత్తవాటిని చేపట్టరాదన్నారు. డబ్బులు, మద్యం తదితరాలు పట్టుబడితే సీజ్‌చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి టీంను ఎన్నికల అబ్జర్వర్లు మానీటరింగ్ చేస్తుంటారని, జీపీఎస్ ద్వారా ఈ టీంలు ఎక్కడ ఉన్నది పరిశీలించనున్నట్లు తెలిపారు. తాసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తాసీల్దార్ రాజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు

## జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని రమ్యశ్రీతో కళాశాల ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, పీడీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, అక్టోబర్ 13 : అథ్లెటిక్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రమ్యశ్రీ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ డిస్కస్ త్రోలో బంగారు పథకం, షాట్‌పుట్‌లో రజిత పతకాన్ని సాధించింది. ఈ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన రమ్యశ్రీని జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో డిస్కస్‌త్రో, షాట్‌పుట్ పోటీలకు ఎంపిక చేశారు. జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేయడంపై ప్రిన్సిపాల్ అప్పియచిన్నమ్మ, ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు అభినందించారు. జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలు ఈనెల 14నుంచి17వరకు తెలంగాణలోని వరంగల్ జిల్లాలో నిర్వహించనున్నారు.

## నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

జడ్చర్ల, అక్టోబర్ 13 : జడ్చర్లలోని చంద్రా గార్డెన్స్‌లో శనివారం బీఆర్‌ఎస్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పాల్గొననున్నారు. ఈనెల 18న సీఎం కేసీఆర్ జడ్చర్లలో నిర్వహించే ఎన్నికల బహిరంగసభలో పాల్గొననున్న నేపథ్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జడ్చర్ల మండలంలోని గ్రామాలలో పార్టీశ్రేణులను కలసి బహిరంగసభ గురించి వివరించారు. ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించనున్నట్లు తెలిపారు.